# తిరుగు.... తిరుగులేదు!

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. అవి అలా తిరగడం వల్లే ప్రపంచం, మన మనుగడ కొనసాగుతోంది.



సైన్స్ ప్రకారం సూర్యుడు తిరగడు. కానీ పురాణాల ప్రకారం ఏడు గుర్రాల రథం మీద తిరుగుతాడు. సూర్యుడి రథసారథి అనూరుడు.

ఒకప్పుడు ఒక చోటు నుంచి మరో చోటుకు తిరగడానికి గుర్రాలు గట్రా ఉండేవి. ఇప్పుడు సైకిళ్లూ స్కూటర్లూ కార్లూ బస్సులూ విమానాలూ ఓడలూ ఉన్నాయి. మనం తిరగాలంటే మన వాహనాల చక్రాలు తిరగాలి. అవి తిరిగితేనే మనం తిరగగలం. అవి తిరగకపోయినా, మనం తిరగగలం మనకాళ్లపై. అయితే, ఎక్కువ దూరం తిరగలేం.

మనం తిప్పితే తిరిగేది కనుకే దానికి 'తిరగలి' అని పేరు పెట్టివుంటారు. ఇప్పుడు తిరగలి పట్నాల్లోని మధ్య తరగతి ఇళ్లల్లో అంతగా కనిపించదు. తిరగలి చేసే పనుల్ని మిక్సీలు చేసేస్తున్నాయి అయితే, మిక్సీల్లోని బ్లేడ్‌లూ తిరుగుతాయి.

మనకు మన గదుల్లోకి చల్లగాలి కావాలంటే ఫేన్లు తిరగాలి. కరెంటు పోయినప్పుడు ఫేన్ ఆగిపోతుంది. 'చచ్చేంరా బాబూ' అనుకుంటాం. కరెంటు రాగానే ఫేన్ తిరుగుతుంది. 'బతికేంరా బాబూ' అనుకుంటాం. అంటే కొన్ని తిరిగితేనే మనకు సుఖం.

తిరుగుటలో ఉన్న హాయి, ఆగుటలో లేదు భాయి!

ఆకాశంలో మేఘాలు తిరిగితేనే వానలు పడతాయి. వానలు పడితేనే పొలాల్లో నాగళ్లూ, ట్రాక్టర్లూ తిరుగుతాయి. అవి తిరిగాకే నారుమళ్లు పడి, ఆ తర్వాత పంటలు పండుతాయి. పంటలు పండితేనే మనం తిండి తిని తిరగగలుగుతాం.

తిరగడానికి సంబంధించి మనకో సామెత ఉంది. మగాడు తిరగక చెడ్డాడు, ఆడది తిరిగి చెడింది అని. ఈ సామెతకు ఇప్పుడు విలువలేదు.

సంపాదించే బాధ్యత ఒకప్పుడు (ఇప్పుడుకూడా చాలావరకూ) మగాడికే ఉంది. తిరగకపోతే సంపాదించడం అసాధ్యం కనుక 'తిరగక మగాడు చెడ్డాడు' అనే సామెత పుట్టింది. స్త్రీకి వంటా వార్పూ బాధ్యత ఇంటిలోనే ఉంటుంది కాబట్టి, తను తిరిగితే ఆ పనులు జరగవు కాబట్టి 'ఆడది తిరిగి చెడింది' అనే సామెత వచ్చింది. ఇప్పుడీ సామెత అందరి ఆడవాళ్లకూ వర్తించదు. స్త్రీలు కూడా అనేక మంది సంపాదించే బాధ్యతను మోస్తూ ఉద్యోగాలు చేస్తున్నారు కాబట్టి తిరగక ఆడది చెడింది' అనే కొత్త సామెత వాళ్లకు వర్తిస్తుంది.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

కొత్త విషయాలు తెలుసుకోవాలంటే తిరగాలి. కొత్త ప్రదేశాలు చూడాలంటే తిరగాలి. ఉపాధి కోసమూ అవసరమైతే ఊళ్లకు ఊళ్లు తిరగాలి.

పూర్వం రాజకుమారులు యుక్త వయస్సురాగానే దేశ పర్యటనకు వెళ్లేవారు. అంటే దేశమంతా తిరగడానికి వెళ్లేవారన్నమాట. ఎందుకు? రాజుకు వృద్ధాప్యం వచ్చేక యువరాజే రాజై రాజ్యాన్ని ఏలాలి. రాజ్యాన్ని పాలించాలంటే ఒక్క చదువూ, యుద్ధ నైపుణ్యమే సరిపోదు. ప్రపంచ జ్ఞానం కూడా కావాలి. ఈ లౌకిక జ్ఞానం కావాలంటే దేశంలోని వివిధ ప్రాంతాలు చూడాలి. అక్కడి ప్రజల స్థితిగతులు తెలుసుకోవాలి. అందుకే యువరాజులు దేశాన్ని తిరిగి వచ్చేవారు.

వ్యాపారస్తులూ తమ వస్తువులు అమ్మడం కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తిరిగేవారు. సింద్‌బాద్ అయితే, ఒక్క వ్యాపారం కోసమే కాకుండా వింతలు చూడడానికి కూడా సాహసంతో తిరిగేవాడు. అనేక కష్టాలనూ ఎదుర్కొనేవాడు. ఆ కష్టాలనుంచి బయటపడి, తన దేశం తిరిగి వచ్చి, తన అనుభవాలను కథలుగా చెప్పేవాడు. అన్నిసార్లు అన్ని కష్టనష్టాలు ఎదురయ్యాయి కదా అని సింద్‌బాద్ తిరగడం మానలేదు. అదే తిరగడంలోని థ్రిల్!

తిరగడానికి సంబంధించి చెడుకూడా లేకపోలేదు. వేశ్యల వెంట తిరిగేవాణ్ని 'తిరుగుబోతు' అంటారు. పనీపాటా లేకుండా దేశాలు పట్టుకుని తిరిగే వాడిని దేశదిమ్మరి అంటారు.

కొన్ని ఉద్యోగాలు చేసే వాళ్లు తిరగక తప్పదు. తిరిగితేనే కొందరికి తిండి.

సేల్స్ రిప్రజెంటేటివ్‌లు తమ కంపెనీ వుస్తువుల అమ్మకాల కోసం నిత్యం తిరుగుతుంటారు. వార్తా ప్రతికల్లో పనిచేసే విలేకర్లూ తిరగక తప్పదు. తిరిగితేనే వాళ్లకు మంచి వార్తలు దొరుకుతాయి. తిరగకుండా ఆఫీసులో కూచుని, ప్రెస్‌నోట్లు కోసం ఎదురుచూసే విలేకర్ల మహాశయులూ కొందరుంటారు. అలాంటివాళ్లు తమ వృత్తిలో ఎక్కడేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంటారు సాధారణంగా.

యంత్రాలు తిరిగితేనే ఫ్యాక్టరీలు నడుస్తాయి. పెద్ద పెద్ద సంస్థల వ్యాపారవేత్తలూ విమానాల్లో దేశ విదేశాలు తిరుగుతుంటారు. రాజకీయ నాయకులు కూడా దేశవిదేశాలు తిరుగుతారు. దేశం లోని వివిధ ప్రాంతాల ప్రజల్ని కలవడానికి తిరుగుతారు. తమ నియోజకవర్గంలోని ప్రజల్ని కలవడానికీ వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికీ తిరుగుతారు. అలా తిరిగేవాళ్లకు ప్రజల్లో తిరుగుండదు.

ఇతర ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల్లాగే రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు ఎ.సి.వై.రెడ్డి, జక్కంపూడి రామోహన్‌రావు, ఎం.పి. కె.వి.ఆర్. చౌదరి, తరచూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొడానికి తిరుగుతుంటారు. ఎ.సి.వై. రెడ్డి వార్డు వార్డులోనూ తిరుగుతుంటాడు.

ఆ మధ్య రాజేంద్రనగర్‌లో జరిగిన ఓ సభలో జక్కంపూడి మాట్లాడుతూ, ఎ.సి.వై. రెడ్డి వెంట తిరగడంవల్లే తానింత వాణ్ని అయ్యేనని అన్నాడు.

అంచేత సవ్యంగా తిరిగితే, తిరుగులేదు.

20.6.94

ఆంధ్రభూమి దినపత్రిక